ఈరోజు
# తెలంగాణ
ప్రజల ఆయుధం..



**విలేకరులు కావలెను**


ఈరోజు తెలంగాణ పేపర్లో పనిచేయుటకు విలేకరులు కావలెను. మండల. జిల్లా. వారీగా కావాలి ఆసక్తిగలవారు నెంబర్కు ఫోన్ చేయగలరు

ఫోన్ నెంబర్ : 8008836669



పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : టి రామకృష్ణ సంపుటి : 01 సంచిక : 116 మంగళవారం 19-5-2025



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నల్లమల పర్యటన సందర్భంగా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకంపై నల్లమల డిక్లరేషన్‌ను ప్రకటించారు. రాష్ట్రంలోని 2 లక్షల 30 వేల 735 మంది షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు 6.69 లక్షల ఎకరాల భూములను ఆర్ఓఎఫ్ఆర్ చట్టం 2006 కింద గిరిజనుల అభివృద్ధికి ఈ నల్లమల్ల డిక్లరేషన్ ఉపయోగపడనుంది. పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తూ వారు సాగు చేసుకుంటున్న స్థానంలోనే ఇందిరా సౌర గిరి జల వికాసం కింద వంద శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు ఈ పథకం కింద భూముల రెగ్యులరైజేషన్ సోలార్ పంప్ సెట్లు, బోరు బావుల తవ్వకం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లను అందించనున్నారు. అందులోనే ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు.



# నల్లమల డిక్లరేషన్

పది అంశాలతో కూడిన డిక్లరేషన్‌నుసోమవారం బహిరంగ సభలో ప్రకటించారు. 2.10 లక్షల మంది ఎస్టి రైతులకు గాను 6 లక్షల ఎకరాలను అభివృద్ధి చేయడానికి 12వేల 600 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించనుంది. 2025, 26 సంవత్సరంలో పది వేల మంది రైతులకు 27 వేల 184 ఎకరాలకు గాను 600 కోట్లను ఖర్చు చేయనుంది. ఇదే విధానం ద్వారా ప్రతి ఏడాది లబ్ధిదారులను పెంచుతూ 2029, 30 నాటికి ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి గిరిజనుల అభివృద్ధికి వినియోగించను న్నారు. ఈ పథకం ద్వారా గిరిజనులకు ఇందిరమ్మ హౌసింగ్ స్కీం ద్వారా ఈ పథకంలో లబ్ధి పొందే రైతులకు ఇళ్లను కేటాయించనున్నారు. అదే విధంగా వారికి ఆర్థిక చేయూత అందించే విధంగా ఒక లక్ష ఎస్టిల నిరుద్యోగ యువతకు సబ్సిడిపై వెయ్యి కోట్ల రూపాయలను స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద వినియోగించనున్నారు. మొత్తం 10అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి మంత్రుల సమక్షంలో ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. రూ. 12,600 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్న సంగతి విదితమే

మిగతా 2లో



## మూడు తరాలపై అక్రమ విద్యుత్ కనెక్షన్ మృత్యు కాటు

### మూడు తరాలను మింగేసి అగ్నిప్రమాదం


**హైదరాబాద్ :** హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం మృత్యుపాశాన్ని మోసుకొచ్చింది. ఈ ఘటనపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా చేసిన దర్యాప్తులో ఓ కీలక విషయాన్ని బయటపెట్టింది. ఆ విషాదానికి మూలం అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్న ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభావిత భవనానికి ఎదురుగా ఉన్న నగల దుకాణం రాత్రి మూతపడిన అనంతరం, అక్కడి కొన్ని కుటుంబాలు హైటెన్షన్ వైర్ నుంచి కరెంట్‌ను కోక్కేల ద్వారా అక్రమంగా వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ లైన్‌ను ఉపయోగిస్తూ బాధిత కుటుంబం ఇంటి కరెంట్ మీటర్‌పై ఎక్కువ లోడ్ పడినట్లు తెలుస్తోంది. అదే లోడ్ కారణంగా మీటర్‌బాక్స్‌లో మంటలు చెలరేగినట్టు.. ఆ మంటలు మొదట మీటర్ బాక్స్‌లో వచ్చి, ఆ బాక్స్ పక్కన ఉన్న ఉడెన్ షోకేజ్‌ను అంటుకున్నాయి. అక్కడ నుంచి మంటలు మరింతగా వ్యాపించి ఏసీ కంప్రెసర్ వరకు తాకాయి. అప్పటికే భవనం పై అంతస్తుల్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు ఏమీ గ్రహించకుండానే మంటలు ఇంటి అంతటా విస్తరించాయి. ఈ ప్రమాదానికి కారణమైన అక్రమ కరెంట్ కనెక్షన్లపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. హైటెన్షన్ లైన్ల నుంచి వ్యక్తిగతంగా కరెంట్ తీసుకోవడాన్ని గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు సమచారం.

ఈ నేపథ్యంలో స్థానికంగా మరిన్ని ఇలాంటి అక్రమ కనెక్షన్లున్నాయా అనే దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో చిన్నచిన్న

మిగతా 2లో

## ఆందాల పోటీలకు రూ.300 కోట్లు

### - పుష్కరాలకు రూ.35 కోట్లా రేవంత్‌ను నిలదీసిన బండి సంజయ్



**కాళేశ్వరం :** సరస్వతి పుష్కరాల సందర్భంగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతి కలయికతో ప్రఖ్యాతిగాంచిన త్రివేణి సంగమంలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేడు పుణ్యస్నానం చేశారు. అనంతరం ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు. యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడ నిధులు విడుదల చేసి ఘనంగా

మిగతా 2లో

## మానవత్వంతో స్పందించండి..

### నష్టపరిహారం పెంచండి - రేవంత్‌కు కేటీఆర్ హితవు



2లో

- అగ్ని ప్రమాద బాధితుకులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- క్షతగాత్రులకు ఓదార్పు.. సంఘటనపై ఆరా
- మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు ఇవ్వాలని డిమాండ్






## సీఎం గారూ.. యుద్ధంలో ఉన్నా.. రాలేకపోతన్న..!!

**దుబ్బాక:** 'దేశ సరిహద్దుల్లో శత్రువులతో నేను పోరాడుతుంటే.. సొంతూరులో భూమిని కబ్జా చేసిన అక్రమార్కులతో నా తల్లిదండ్రులు పోరాడాల్సి వస్తోంది' అని సిద్దిపేట జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ బూర రామస్వామి వాపోయాడు. తన భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ నుంచి శనివారం ఓ సెల్ఫీ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా భూంపల్లి–అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన రామస్వామి తన భూమి కబ్జా అయిన తీరును ఆ వీడియోలో వివరించాడు. '1992లో ధర్మాజీపేట శివారులోని 406 సర్వే నంబర్‌లో నా తల్లిదండ్రులు 1.16 ఎకరాల భూమిని సాదాబైనామా

మిగతా 2లో

## బెంగుళూరు మునక - ఆరు గంటల పాటు దంచికొట్టిన వర్షం



**బెంగళూరు :** టెక్ నగరం బెంగళూరులో వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం నగరాన్ని ముంచెత్తింది. దాదాపు ఆరు గంటలకుపైగా ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షానికి నగరం మొత్తం నీట మునిగింది. లోతట్టు ప్రాంతాలు జలాశయాలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది బెంగళూరులో ఇదే అత్యధిక వర్షపాతంగా నగర వాసులు చెబుతున్నారు. నగరంలో వర్షం సృష్టించిన బీభత్సానికి సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేస్తున్నారు. ప్రసిద్ధ సిల్క్ బోర్డ్ జంక్షన్, హెచ్‌ఆర్‌బీఆర్ లేఅవుట్, బొమ్మనహళ్లిలను

మిగతా 2లో




## అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి..

- రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ తో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి.
- ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్.

2లో

## 12 మంది పాక్ ఏజెంట్లు అరెస్ట్



దేశంలో ఇప్పటికీ దాదాపు డజన్‌కు పైగా రహస్య ఏజెంట్లు వివిధ ప్రాంతాలలో పట్టుబడ్డారు. పాకిస్థాన్‌కు కీలక సైనిక రహస్య సమాచారం చేరవేతల అభియోగాలతో, ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో పట్టుబడ్డ డారిలో ట్రావెటర్ యూట్యూబర్ జ్యోతి, ఇతరులు అనేకులు ఇప్పటివరకూ అరెస్టు అయ్యి ఇంటరాగేషన్‌లను ఎదుర్కొంటున్నారు. పాకిస్థాన్ ఇరుగుపొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వారే ఈ పట్టుబడ్డవారిలో ఉన్నారని అధికారిక ప్రకటనలతో వెల్లడైంది. పహల్గాం ఉగ్రదాడి, తరువాత ఆపరేషన్ సిందూర దశల్లో ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో ఏజెంట్లను

మిగతా 2లో

# నల్లమల డిక్లరేషన్

తెలంగాణలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు పోడు పట్టాలు మంజూరైన నేపథ్యంలో బీడు వారుతున్న పోడు భూములకు జలకళను తెచ్చేందుకే సర్కార్ ఈ కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టిన సంగతి విదితమే.రాబోయే ఐదేళ్లలో 2.10 లక్షల ఎకరాల పోడు భూముల్లో సాగుకు వంద శాతం సబ్సిడీతో సోలార్ పంప్ సెట్లను అందజేయనున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడం ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా బలంగా చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా విద్యుత్ సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం వర్తించనుంది. గిరిజన రైతుకు 2 ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే.. సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఈ పథకం కింద ఏర్పాటు చేయనున్నారు.

అనంతరం కొండారెడ్డి పల్లెకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి సీతారామాంజనేయ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు సీఎంను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ స్వామికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సౌర విద్యుత్‌తో ఆదివాసులు ఆదాయం మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమ్రాబాద్ ఇందిర సౌర గిరి జల వికాసం పథకంలో భాగంగా రైతులకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా ఇస్తామని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు 5, 7.5 హెచ్‌పీ పంపుసెట్లు ఇస్తామన్నారు.

**'అచ్చంపేట'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**

అచ్చంపేటను మోడల్ నియోజకవర్గంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో వంద రోజుల్లో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ పంపుసెట్ల స్థానంలో వీటిని బిగిస్తారని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి గిరిజనులు ఆదాయం పొందాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**6.63 లక్షల ఎకరాల పోటు పట్టాలు**

రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6.63 లక్షల ఎకరాల విస్తీర్ణానికి (2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు) పోడుపట్టాలు మంజూరయ్యాయి. ఇందులో విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే సమీప రైతులను కలిపి బోర్వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేస్తారు.

ఈ నెల 25 వరకు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించి, జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన, భూగర్భ జలాల సర్వే తదితర పనుల్ని గిరిజన సంక్షేమశాఖ చేపడుతుంది. జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనుల్ని పూర్తి చేస్తారు. తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27.184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# మానవత్వంతో స్పందించండి..

**హైదరాబాద్ :** చార్మినార్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. సోమవారం క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు కేటీఆర్ ముందు కన్నీరు పెట్టుకోగా వారిని ఓదార్చారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ.. ఐదు లక్షలు కాకుండా రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని, అవి వారి ఇంటిని, వ్యాపారాన్ని పున:నిర్మించుకోవడానికి ఉపయోగ పడుతాయని అన్నారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజన్ లో నీళ్లు ఉంటే గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదని అభిప్రాయపడ్డరు. . ఫైర్ బ్రిగేడ్ కు సరైన మాస్కులు లేకపోవడంలో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారన్నారు.. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందని అన్నారు.. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమని పేర్కొన్నారు.

**కేటీఆర్ ఇంకా ఏమన్నారంటే**

- నిన్నటి గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద సంఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం. గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరు.
- 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలోని 17 మంది చనిపోవడం మనసున్న ప్రతీ ఒక్కరిని కలిచివేసింది.
- బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదు. కాని వారు కొన్ని విషయాలు చెప్పారు.
- ఫైర్ బ్రిగేడు నీళ్లు లేకుండా వచ్చింది.

ఫైర్ బ్రిగేడ్ వాళ్లు సరైన మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారు. అంబులెన్స్‌లలో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం దారుణం.

- ఈ కనీస సదుపాయలు ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్‌లో ఉంటే కొన్ని ప్రాణాలు బతికేవని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు.
- అగ్నిప్రమాదం జరగగానే స్థానికులైన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి మమ్మల్ని కాపాడారని చెప్పారు.
- మాకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూడదని కోరుకుంటున్నారు. భవిష్యత్తులో ఎవరు చనిపోకుండా చూడమని కోరారు.
- నేను రాజకీయం చేయడానికి రాలేదు. ఎవరినీ విమర్శించడం లేదు. కాని ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యల మీద రివ్యూ సమావేశం పెట్టుకోవాలి.
- పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశం. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్‌లు రావడానికి కూడా వీలుకాలేదు.
- అధికారులకు నిరంతరం ట్రైనింగ్ ఇవ్వాలి. తరుచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. ఇవేవి జరగలేదు. ఇది మంచిది కాదు. అంబులెన్స్‌లు వచ్చినయి కాని అందులో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడంతోనే ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది. ఎనిమిది మంది చిన్నారులు తమ కళ్లముందే చనిపోయారని చెపుతున్నారు.
- ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూడండి.
- అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ ఇలాంటి వాటిపై కూడా పెట్టండి. అందాల పోటీలపై పెట్టే ఖర్చు ఇలాంటి సందర్భాల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయలపై పెట్టండి.
- రేవంత్ రెడ్డి దగ్గరనే హోం, మున్సిపల్ శాఖలు ఉన్నాయి. సంఘటన స్థలం దగ్గరికి రేవంత్ రెడ్డి వస్తే బాగుండేది.
- ఐదు లక్షల నష్టపరిహారం సరిపోదు. ఇంటికి, వ్యాపారానికి తీవ్ర నష్టం జరిగింది. 125 సంవత్సరాల నుంచి హైదరాబాద్ లో ఉంటున్న అగర్వాల్ కుటుంబం మళ్లీ తమ వ్యాపారం ప్రారంభించుకోడానికి ప్రభుత్వం సహకరించాలి.
- రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను.
- బీఆర్ఎస్ తరపున కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తాము. రాజకీయం చేయడానికి రాలేదు. ఇలాంటి కడుపు కోత ఇంకెవరికి రాకూడదని వచ్చాను.
- ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని కోరుతున్నాను.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి...

**సూర్యాపేట** అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. కలిసి పని చేద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ ను కోరారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్ లో రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ (Valerii Khodzaev) ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ కు వివరించారు.దేశంలో తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకు వెళుతున్నదని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, రాష్ట్రంలో ఫార్మా ఇండస్ట్రీ తో పాటు ఇతర పరిశ్రమల అభివృద్ధికి అదే విధంగా హార్డ్వేర్, సాఫ్ట్వేర్ విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించి ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. టెక్స్ టైల్, కోల్ ఇండస్ట్రీ బయోటెక్నాలజీ, టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి గురించి వివరించారు. రాష్ట్రంలో అద్భుతమైన మానవ వనరులను తీర్చిదిద్దిన ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి అన్ని రకాలుగా తెలంగాణ రాష్ట్రం అనువుగా ఉంటుందని వివరించారు. భారత్- రష్యా దేశాల మధ్యహోమంచి సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సత్సంబంధాలు కొనసాగించడానికి కావలసిన అన్ని రకాల సహకారాలు, సదుపాయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా వాలెరి ఖోడ్జాయేవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో అడ్వాన్స్ హైటెక్నాలజీ, పురోగమిస్తున్న పరిశ్రమల అభివృద్ధిని గమనించామని చెప్పారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి మేము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఫార్మా, బయోటెక్నాలజీ ,టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి చాలా బాగున్నందునహో రష్యా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదం ఒక గుణపాఠం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్ :** నగరంలోని పాతబస్తీ గుల్జార్ హౌస్ సమీపంలో ఒక పురాతన భవనంలో నిన్న సంభవించిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో 17 మంది అగ్నికి ఆహుతైన నేపథ్యంలో, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదం ఒక గుణపాఠం లాంటిదని ఆయన పేర్కొన్నారు. ఈ దురదృష్టకర సంఘటనపై ఆయన మాట్లాడుతూ, "పాతబస్తీ గుల్జార్ హౌస్ దగ్గర్లోని భవనంలో జరిగిన అగ్నిప్రమాదం మనందరికీ ఒక గుణపాఠం వంటిది. ఈ ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం" అని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పురాతన కట్టడాలలో అగ్నిమాపక భద్రతా నియమాలను ఏమాత్రం



పట్టించుకోకపోవడం, వాటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంలో విఫలం కావడం వల్లే ఇంతటి ఘోర ప్రమాదం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇలాంటి నిర్లక్ష్యం వల్లనే అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణ, పాత భవనాల్లో భద్రతా ప్రమాణాల పెంపునకు సంబంధించి త్వరలోనే ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని ఆయన వెల్లడించారు. పాత భవనాలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు, వాటిని కచ్చితంగా అమలుపరిచేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు.

# మంటలు ఆర్పడంలో ఆలస్యమైందా?

**చార్మినార్ :** గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ఫైర్ సిబ్బందికి సరైన వసతులు లేకపోవడంతో వేగంగా మంటలు ఆర్పేందుకు లోపలికి వెళ్లలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఘటనా స్థలికి వెళ్లేందుకు మెట్లు చిన్నగా ఉండడం, వెళ్లడానికి ఫైర్ సిబ్బంది ఇతర ఏర్పాట్లు చేశారు.అలాగే ప్రధానంగా మంటలు, పొగ, ప్రమాదకరమైన గ్యాస్‌ల నుంచి రక్షణ పొందేందుకు ఉపయోగించే బ్రీతింగ్ మాస్కులు సరిగ్గా లేకపోవడంతో ఘటనా స్థలికి వెళ్లిన సిబ్బంది కొద్దిసేపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటికి తోడు మంటలను ఆర్పేందుకు ఫైరింజన్లలో నీరు కూడా లేదనే ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి కారణాలతో సహాయక చర్యలో ఆలస్యం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. అగ్నిప్రమాదం చిన్నదే అయినా పొగ ఎక్కువగా రావడంతోనే భారీగా ప్రాణ నష్టం జరిగింది.

**నీటిని నింపడంలో ఆలస్యం.. ?**

గుల్జార్ హౌస్‌లో 11 అగ్నిమాపక యంత్రాలు మంటలు అర్పేందుకు ఘటనాస్థలికి వచ్చాయి. అయితే ఇక్కడకు వచ్చిన అగ్నిమాపక వాహనాల్లో నీటిని నింపడంలో ఆలస్యం జరిగిందనే బాధిత కుటుంబాల నుంచి విమర్శలు వస్తున్నాయి. వేసవి కాలం కావడంతో నీటిని నింపుకోవడానికి ప్రయత్నించిన అగ్నిమాపక నియంత్రణ వాహనాల్లో అక్కడక్కడ నీటిని నింపేందుకు జలమండలి సిబ్బంది నిరాకరించారనే ఆరోపణలు వస్తున్నాయి.

**రోబోను వాడాలనుకున్నారు..** గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని నివారించేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు రోబోను వాడాలనుకున్నారు. అయితే రోబోను వాడేంతగా ప్రమాద తీవ్రత లేదని గుర్తించి దానిని తిరిగి వెనక్కి పంపించారు. గుల్జార్ హౌస్ ప్రమాద ఘటనకు షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదాన్ని గుర్తించేందుకు క్లూస్‌టీమ్ ఘటన స్థలికి వెళ్లినా భవనం పూర్తిగా దెబ్బతినడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.దవిద్యుత్ వాడకం పరిమితికి మించి వాడుతున్న క్రమంలోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి ఉంటుందని ఇప్పటికే అధికార యంత్రం ఒక నిర్ధారణకు వచ్చింది. అగ్నిమాపక శాఖ వద్ద సరిపోయినన్ని మాస్కులున్నాయి.. సరిపోయినంత నీళ్లు ఉన్నాయి.. ప్రమాదాన్ని బట్టి ఉపయోగించేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అఫీసర్ శ్రీదాస్ తెలిపారు. మంటల్లో చిక్కుకున్న వారిని మానవ సహాయం సరిపోకపోతే రోబోను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యాం..కానీ అక్కడ ప్రమాదం చిన్నదని.. అయితే పొగ ఎక్కువగా రావడంతోనే ప్రాణ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసు నమోదు...** గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై ఆదివారం చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో మృతుల బంధువు ఉత్కర్ష్ మోడీ ఫిర్యాదు చేశారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో కోరారు. 6:45 కు తన తండ్రి వినోద్‌మోడీకి సమీప బంధువు రోహిత్ ఫోన్‌చేసి అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పారు.. తాము హుటాహుటినా వెళ్లి చూసేసరికి ఫైర్ సిబ్బంది సహాయకచర్యలో ఉన్నారన్నారు. 17మందిఅపస్మారక స్థితిలో ఉన్నవారిని బయటికి తీసి ఆస్పత్రికి తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**స్వచ్ఛందంగా వ్యాపారాలు మూసివేసి..** అగ్ని ప్రమాద ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోవడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ పెరల్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను మూసివేసి సంతాపం ప్రకటించారు. చార్మినార్ సమీపంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని తదితరులు హాజరయ్యారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**కాపాడుకునేవాళ్లమేమో..?** ఘటనా స్థలంలోనే ముగ్గురు చనిపోగా, చికిత్సనందించే క్రమంలో 14 మంది ప్రాణాలు విడిచారు. విపరీతమైన పొగను పీల్చుకోవడం మూలంగా స్పృహ తప్పి పడిపోయి, అగ్నికి ఆహుతయ్యారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందించి ఉంటే కొద్దిమందినైనా కాపాడే ఆస్కారం ఉండేదంటూ.. పలువురు వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెల్లవారుజామున వ్యాపించిన మంటల కారణంగా ఇంట్లోని వస్తువులన్నీ కాలుతుండటంతో ఒక్కసారిగా వాటి నుంచి వెలువడే పొగలో కార్బన్ మోనాక్సైడ్, స్మోక్ డస్ట్, అధిక ఉష్ణోగ్రత ఉండటం మూలానా వాటిని పీల్చిన వారందరూ ఆక్సిజన్ అందకపోవడంతో ఇబ్బందిపడ్డారు.దట్టమైన పొగ కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. మంటలు మరింత ఎక్కువ కావడం మూలంగా వారి శరీరాలు దాదాపు 50 నుంచి 60 శాతం వరకు కాలిపోయాయని ఫోరెన్సిక్ వైద్యులు సైతం వెల్లడించారు. ఊపిరి పీల్చుకునేందుకు నరకయాతన పడుతున్న వారికి సత్వరంగా ఆక్సిజన్ అందిం ప్రాథమిక వైద్యమందించి ఉంటే మరణాల సంఖ్య తగ్గేదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఘటనాస్థలం నుంచి ఆసుపత్రులకు తరలించేవరకు అంబులెన్స్‌లలో అక్సిజన్ అందించి ఉంటే వారిలో కొంతమందినైనా కాపాడే ఆస్కారం ఉందంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఏడు అంబులెన్స్‌లు మాత్రమేనా..** అగ్నిప్రమాదం సంభవించగానే మొదట గోషామహల్ నుంచి ఒక్క అంబులెన్స్ మాత్రమే ఘటనాస్థలానికి చేరుకుంది. ఆ తరువాత ప్రమాద తీవ్రతను గ్రహించిన వైద్యశాఖ మరో 6 అంబులెన్స్‌లను ప్రమాద స్థలానికి చేర్చింది. ప్రమాదంలో 17 మందికి గాను ముగ్గురు అక్కడే మృతిచెందగా మిగతా 14 మందిని కేవలం ఏడు అంబులెన్స్‌ల్లోనే ఆసుపత్రులకు చేర్చారు. వాటిలో సైతం ఆక్సిజన్ లేదంటూ మృతుల బంధువులు ఆదివారం మంత్రి పొన్నంను నిలదీసిన విషయం తెలిసిందే. సకాలానికి ఆక్సిజన్ అందించినా..

# మూడు తరాలపై అక్రమ విద్యుత్ కనెక్షన్ల మృత్యు కాటు

నిబంధనల ఉల్లంఘన ఎంతటి ప్రాణ నష్టం కలిగించగలదో మరోసారి తేలిపోయింది.హైదరాబాద్‌లోని పాతబస్తీ గుల్జార్ హౌజ్ వద్ద ఘోర అగ్ని ప్రమాదం జరిగి ఆదివారం ఉదయం 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారందరూ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు. గుల్జార్‌హౌజ్ వద్ద ముత్యాల వ్యాపారి ప్రహ్లాద్ మోదీ(73)కి జీ ప్లస్ 2 బిల్డింగ్ ఉంది. కింద పోర్షన్‌లో వారికి 3 ముత్యాల దుకాణాలు ఉన్నాయి. ప్రహ్లాద్ మోదీ తాత దాదాపు 150 ఏళ్ల క్రితం ముత్యాల వ్యాపారం చేసేందుకు హైదరాబాద్ వచ్చారు. గుల్జార్ హౌజ్ వద్ద ఓ బిల్డింగ్ కొని వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆ వ్యాపారాన్ని ప్రహ్లాద్ మోదీ తండ్రి పూనంచంద్ కొనసాగించారు. అతడి నుంచి ఈ వ్యాపారాన్ని ప్రహ్లాద్ మోదీ, అతడి సోదరుడు రాజేంద్ర కుమార్ మోదీ తీసుకున్నారు. బిల్డింగ్‌లోని కింది భాగంలో ముత్యాల వ్యాపారం చేస్తున్న ప్రహ్లాద్ మోదీ, అదే బిల్డింగ్‌లోని పై రెండు అంతస్తుల్లో కొడుకులు, మనుమలతో కలసి ఉంటున్నారు. ప్రహ్లాద్ మోదీకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.చిన్న కుమారుడు పంకజ్ మోదీ, భార్య ముగ్గురు పిల్లలతో తండ్రి వద్దే ఉంటున్నాడు. అగ్ని ప్రమాదంలో ప్రహ్లాద్ మోదీ దంపతులతో పాటు వారి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనవరాళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు మృతి చెందడంతో బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# ఆందాల పోటీలకు రూ.300 కోట్లు

నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి? అని ప్రశ్నించారు.దపుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# సీఎం గారూ.. యుద్ధంలో ఉన్నా.. రాలేకపోతన్న..!!

కింద కొనుగోలు చేశారు. ఆ భూమిని నా గ్రామానికే చెందిన వీఆర్వో రమేష్.. తన సోదరుల పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నాడు. భూమి గురించి అడిగితే వీఆర్వో బంధువులు నా తల్లిదండ్రులను బెదిరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మా భూమిని మాకు దక్కేలా చేయాలి'అని వేడుకున్నాడు. ఈ వీడియోపై స్పందించిన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు.. వెంటనే జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఫోన్ చేసి జవాన్ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. తన ఎక్స్ ఖాతాలో కూడా ఆ వీడియోను పోస్ట్ చేశారు. దీంతో రెవెన్యూ యంత్రాంగంలో వెంటనే స్పందించింది. శనివారం సాయంత్రం భూంపల్లి తహసీల్దార్ మల్లిఖార్జున్, ఆర్ఐ తదితరులు పంచనామా నిర్వహించి కలెక్టర్‌కు నివేదించారు.


# బెంగుళూరు మునక - ఆరు గంటల పాటు దంచికొట్టిన వర్షం

వర్షం ముంచెత్తింది. కాగా, నిన్న కెంగేరిలో అత్యధికంగా 132 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు కర్ణాటక రాష్ట్ర విపత్తు పర్యవేక్షణ విభాగం వెల్లడించింది. అలాగే బెంగళూరు ఉత్తర భాగంలోని వడేరహల్లిలో 131.5 మిల్లీమీటర్ల వర్షపాతంతో రెండో స్థానంలో నిలిచింది. చాలా ప్రాంతాల్లో రాత్రిపూట 100 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మరోవైపు బెంగళూరులో గురువారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

# 12 మంది పాక్ ఏజెంట్లు అరెస్ట్

అరెస్టు చేశారు. పంజాబ్‌నుంచి ఆరుగురు, హర్యానా నుంచి ఐదుగురు , యుపి నుంచి ఒక్కరు పట్టుబడ్డారు. పలు రకాలుగా పొరుగుదేశం ప్రోద్బలాలకు లొంగి వీరు రహస్య సమాచారం తెలియచేసినట్లు, కొందరు తాము ఏమి చేస్తున్నామనేది తెలియని దశలో ఏజెంట్లుగా మారినట్లు వెల్లడైంది. పాకిస్థాన్ ఇంటలిజెన్స ఆపరేటివ్స్ (పిఐఒ)లకు కీలక సమాచారం వెల్లడించడం వీరి డ్యూటీగా మారింది. పూర్తి స్థాయి దర్యాప్తుల తరువాత ఈ డజన్ మంది ఏ మేరకు సమాచారం ఏ స్థాయిల్లో లోగుట్టు అందించారనేది వెల్లడి కానుంది. ప్రత్యేకించి పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆపరేషన్ క్రమంలోనే భారతీయులు అనేకులు పాక్ ఏజెంట్లు అయినట్లు తెలిసింది. ఎక్కువగా భారత భద్రతా సంస్థలతో సంబంధాలు ఉన్న యువతను విద్యాధికులను నిరుద్యోగులను ఎంచుకుని వారికి భారీ స్థాయి ధనం , ఇతరత్రా విలాసాలకు అలవాటు చేసి ఈ విషవలయంలోకి దింపినట్లు గుర్తించారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ



మరో ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

బుధవారం కరీంనగర్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే చాన్స్ ఉందని పేర్కొంది.ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది. అలాగే, గురు, శుక్ర వారాల్లోనూ ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది వాతావరణశాఖ. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో 8 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## కొల్లాపూర్ లో జోరుగా కొన సాగు తున్న తెలుగుదేశం పార్టీ లో చేరికలు..



**కొల్లాపూర్ మే 19 (ఈ రోజు తెలంగాణ ప్రతినిధి)**స్థానిక సంస్థల ఎన్నికల లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయం గా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లో తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఆడ్ హాక్ కమిటీ చైర్మన్ పాలెం సుధాకర్ నాయుడు ఆధ్వర్యం లో జోరు గా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులు, తెలుగుదేశం పార్టీలో చేరికలు జోరు గా కొనసాగుతున్నాయి. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ(మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిథ్యం) కేంద్రం లో సోమవారం ఉదయం కొల్లాపూర్ పట్టణ సంజనను, బొజ్జన్న నాయుడు, ఆంజనేయులు గౌడ్, చెన్నయ్య, జయశ్రీ లను పాలెం సుధాకర్ నాయుడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని ఇస్తూ వారిని తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా పాలెం సుధాకర్ నాయుడు మాట్లాడుతూ కొల్లాపూర్ తాలూకా లో సీనియర్ నాయకులను కలుపు కు పోతూ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం ఉన్న తీసుకురావడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. 1999 లో తెలుగుదేశం పార్టీకి వీర అభిమానులై ఉండి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేసి ప్రస్తుతము ఏ పార్టీ లో చేరకుండా నిలకడగా స్తబ్ధ గా ఉన్న తెలుగుదేశం పార్టీ అభిమానులు నాయకులు కార్యకర్తలు కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని గ్రామ గ్రామాన జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు లో పాల్గొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కొల్లాపూర్ నుండి పోటీ చేయనున్న తెలుగు దేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడానికి తమతో కలిసి రావాలని పాలెం సుధాకర్ నాయుడు ఒకప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు విజ్ఞప్తి చేస్తూ పిలుపునిచ్చారు. కొల్లాపూర్ పట్టణం లో సోమవారం రోజు జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు, చెరికల కార్యక్రమం లో పాలెం సుధాకర్ నాయుడు తో పాటు కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉరి సుధాకర్, తెలుగుదేశం పార్టీ కొల్లాపూర్ మండల అధ్యక్షులు బరిగెల సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదం దురదృష్టకరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**హైదరాబాద్. ఈరోజు తెలంగాణ. మే 19**హైదరాబాదులో జరిగిన అగ్ని ప్రమాదం దురదృష్టకరమని, ఈ ఘటనలో అధిక ప్రాణ నష్టం జరగడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులు కోలుకోవడానికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన అన్నారు. ప్రమాదం జరగడానికి గల కారణాలపై విచారణ జరిపించాలని వారన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీని పకడ్బందీగా అమలు చేయాలని సాంబశివరావు సూచించారు.

## తంగేళ్లపల్లి - వెంకిర్యాల వాగు బ్రిడ్జికి మోక్షం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ

### కాంగ్రెస్ యువ నాయకుడు జితేందర్ రెడ్డి హర్షం



**షాద్ నగర్. ఈరోజు తెలంగాణ.మే 19** షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలంలోని కొందుర్గు నుండి నవాబ్ పేట్ వెళ్లే రోడ్డు మధ్యలో తంగేళ్లపల్లి వెంకిర్యాల మధ్యలో గల వాగు వంతెన పనులను త్వరలో తిరిగి ప్రారంభించబోతున్నట్లు ఆర్ అండ్ బి ఈఈ రవీందర్ తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామ ప్రజలతో కలిసి సోమవారం వంతెనను పరిశీలించడం జరిగింది ఎన్నో రోజుల నుండి కొందుర్గు నుండి నవాబ్ పేట్ మరియు మహబూబ్ నగర్ వెళ్లే వాహనదారులు మరియు స్థానిక మండల ప్రజల కష్టాలను చూసి చలించిన ఎమ్మెల్యే శంకర్ కాంట్రాక్టర్ కు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించడంతోపాటు వ్యక్తిగతంగా నిర్మాణానికి అవసరమయ్యే సామాగ్రిని కూడా సమకూరుస్తానని హామీ ఇవ్వడంతో సంబంధిత కాంట్రాక్టర్ కూడా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గానికి ఇటువంటి శాసనసభ్యులు ఉండడం నియోజకవర్గ ప్రజల అదృష్టం అని మండల యువ నాయకుడు జితేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు..

# భారత దేశం సుభిక్షం గా ఉండాలంటే..

# ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం ఉండాలి.



**కొల్లాపూర్, మే 19. (ఈ రోజు తెలంగాణ ప్రతినిధి:యస్.పి.మల్లిఖార్జున సాగర్)**భారతదేశం శత్రు దుర్భేద్యం గా, పటిష్టం గా సుభిక్షం గా , సశ్య శ్యామలం గా ఉండాలంటే పరిపాలనా దక్షుడైన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం ఎప్పటికీ ఉండాలని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇంచార్జి ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం తాళ్ల నరసింహపురం గ్రామం లో సోమవారము ఉదయం భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్లేని సుధాకర్ రావు భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారత దేశం సుభిక్షం గా ఉండాలంటే ఈ దేశానికి నరేంద్ర మోడీ నాయకత్వం ఎంతైనా అవసరం అని ఆయన అన్నారు. ఈ రోజు రాష్ట్రాలలో పరిపాలన జరుగుతుందంటే అది కేంద్ర ప్రభుత్వము రాష్ట్రాలకు మంజూరు చేసిన నిధుల తోనే అని ఆయన అన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రం లో జరిగే ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి వస్తుంది అని ఎల్లేనీ సుధాకర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ హామీలు కానీ ఎన్నెన్నో వాగ్దానాలు చేసి అధికారం లోకి వచ్చిందనీ, తీరా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలకులు, నాయకులు ప్రభుత్వం ను నడిపే అర్హత ను కోల్పోయి ఇచ్చిన ఆరు హామీ లను అమలు చేయలేక మరిన్ని అబద్ధాలు ఆడుతూ, 66 మోసాల తో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర చేతిలో వైకుంఠం చూపుతూ అసమర్ధ త పాలన చేస్తున్నదని ఆయన కాంగ్రెస్ పార్టీ పాలకుల అసమర్ధ పాలన తీరులను విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అధికారం అప్పచెపితే ప్రభుత్వ పాలన ను సక్రమం గా కొనసాగించలేని అసమర్థత కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకులు "ఆడలేక మద్దెల దోలు" అన్నట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదంటూ భారతీయ జనతా పార్టీ పై నిందలు వేయడం సరి అయినది కాదని సుధాకర్ రావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలకులకు నాయకులకు హితవు పలికారు. భారతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో కొల్లాపూర్ మండల బిజెపి అధ్యక్షుడు కేతూరి నారాయణ, మాజీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తమటం శేఖర్ గౌడ్, రమేష్ యాదవ్, కుర్మయ్య, పాండు, స్వామి, చందు తదితరులు పాల్గొన్నారు.

# వనరులున్నా పరిశ్రమల ఏర్పాటు కు నోచుకోని కొల్లాపూర్

**కొల్లాపూర్, మే 19. ( ఈ రోజు తెలంగాణ ప్రతినిధి:యస్.పి. మల్లికార్జున సాగర్).**కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని నల్లమల్ల అడవులలో ప్రకృతి సహజ సిద్ధము గా లభించే వనరులు ఎన్నో ఉన్నా ప్రభుత్వాల పాలకుల నిర్లక్ష్యాల మూలము గా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లో పరిశ్రమల ఏర్పాటుకు నోచుకోక కొల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే లా పడి ఉన్నదని సిపిఐ నేతలు బాల నరసింహ ఫయాజు లు అన్నారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోనీ నల్లమల్ల అటవీ ప్రాంతాలలో ప్రకృతి సహజ సిద్ధముగా లభించే ఎదురు బొంగు సున్నపురాయి ఇనుప ఖనిజాల ను ఆధారము చేసుకొని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి కొల్లాపూర్ ప్రాంత యువతి యువకులకు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం అటవీ ప్రాంతం లోని మలచింతలపల్లి గ్రామం లో సోమవారం ఉదయం సిపిఐ జెండాను బాల నరసింహ ఎగురవేస్తూ సిపిఐ కొల్లాపూర్ మండల 18వ మహాసభలను జంగం శివుడు అధ్యక్షతన సోమవారం రోజు ప్రారంభించారు. ఈ మహా సభల కు ముఖ్య అతిథులు గా హాజరైన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ , రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ఎండి ఫయాజ్ లు మాట్లాడుతూ నల్లమల ప్రాంతం లో ప్రకృతి సహజ సీద్దము గా లభించేటటువంటి ముడి సరుకుల ఆధారం గా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గము ( మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిత్యం) లో ముడి పేపర్ పరిశ్రమ ను, సిమెంట్ పరిశ్రమలను ఏర్పాటు చేసి కొల్లాపూర్ ప్రాంతం లోని యువతి యువకులకు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాది లు కల్పిస్తూ




కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధి కి పాటుపడాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యం గా, ప్రజా సమస్యల పరిష్కారా లే పోరాటాలుగా కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయని, వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో పదవులు ఉన్నా లేకున్నా కార్మిక ,కర్షక ,పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన వారు కమ్యూనిస్టులు మాత్రమేనని అని వారన్నారు. ఒకప్పుడు కరువు ప్రాంతం గా ఉన్నటువంటి కొల్లాపూర్ ప్రాంతం కమ్యూనిస్టుల పోరాట ఫలితం గా సాధించినటువంటి కేఎల్ఐ ద్వారా నేడు అభివృద్ధి దిశగా సాగుతుందని అదే విధం గా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంకా అభివృద్ధి చెందుతుందని వారన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు పరచాలని, ఇందిరమ్మ ఇళ్ళను నిరుపేదలైన ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల సెలెక్షన్ లిస్టును గ్రామపంచాయతీ కార్యాలయం లో అతికించాలని, రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో రైతులకు తక్షణమే అందజేయాలని బాల నరసింహ ఫయాజు లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం కుల, మత ,ప్రాంత ప్రతిపాదికన పరిపాలన కొనసాగించడం సిగ్గుచేటని వారు విమర్శించారు.
పహల్గాం తీవ్రవాదుల దాడి తర్వాత భారత దేశ రక్షణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వారు తీవ్రం గా విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితం గానే దేశం లో రాష్ట్రం లో అనేక హక్కులు సాధించబడ్డాయని 100 సంవత్సరాలుగా ఏనాడు కమ్యూనిస్టులు అధికారం లో లేకున్నా నిరంతరం దేశ అభివృద్ధి కొరకై ప్రజల పక్షాన పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని వారన్నారు. ఈ మహసభల కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్. ఇందిరమ్మ, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి. కురుమయ్య,కిరణ్ కుమార్, బండి లక్ష్మీపతి, మండల సమితి సభ్యులు అమరగిరి స్వామి, లక్ష్మయ్య, నరసింహ, అక్బర్ మండలం లోని వివిధ గ్రామాల సిపిఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు

# గూడు కోసం గొప్పలు చెప్పి.. "గోడు" మిగిల్చారు..!

### పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేక పోయారు

### షాద్ నగర్ "ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్"

### షాద్ నగర్ పట్టణంలో 3,4, 19, 20,21 వార్డులలో ఇందిరమ్మ గృహాలకు శంకుస్థాపన

### భారీగా తరలివచ్చిన పట్టణ కాంగ్రెస్ శ్రేణులు

### ఆర్భాటంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కార్యక్రమాలు

### అసంపూర్తిగా గత పాలకులు నిర్మించిన డబల్ బెడ్ రూంలు

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మరమ్మత్తులకు రూ. 7 కోట్లు




**షాద్ నగర్. ఈరోజు తెలంగాణ. మే 19** పేద ప్రజల గూడు కోసం గొప్పలు చెప్పి ఏది మిగిల్చకుండా గత పాలకులు అన్యాయం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కంకణబద్ధులై ఉన్నామని అందులో భాగంగానే నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలోగల 3, 4, 19, 20, 21 వార్డులలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితర స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో అనేకమంది లబ్ధిదారుల ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి భూమి పూజ నిర్వహించారు పలుగు పారా పట్టిమట్టిని తీశారు. అనంతరం ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ..గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు పేదల గుడు కోసం ఎన్నో గొప్పలు చెప్పి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నియోజకవర్గంలో ఇవ్వలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరిచేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి 3500 ఇల్లు ప్రభుత్వం కేటాయిస్తుందని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ గృహాల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టమన్నారు. ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవడానికి తాము ముందుకు వస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద రైతు కుటుంబం నుండి వచ్చారని నిరుపేదల బడుగు బలహీన వర్గాల సబ్బండ వర్గాల కష్టనష్టాలు తెలిసిన ఒక సామాన్య వ్యక్తిగా వారు కలలుగన్న కలల సౌధం ఇందిరమ్మ గృహం అని భావించి నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశారని గుర్తు చేశారు. తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పచేసి ఆగం చేశారని ఘాటుగా విమర్శించారు. అప్పులను అధిగమించి కష్టనష్టాలను ఓర్చుకొని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

**డబుల్ బెడ్రూం ఇళ్ల అసంపూర్తి పనులకు రూ. 7కోట్లు**

గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుండి ఇప్పుడిప్పుడే కోలుకొని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఓర్చుకొని ముందుకు సాగుతుంటే కొందరు అవాకులు చావాకులు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఎన్నో గొప్పలు చెప్పి గూడు లేకుండా పేదలకు గూడు మిగిల్చారని విమర్శించారు. గత పది ఏళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా పేదలకు పంచలేదని అన్నారు. నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు కిటికీలు, తలుపులు లేవని విద్యుత్ సౌకర్యం మంచినీటి సౌకర్యం కూడా లేదని అన్ని అసంపూర్తిగా చేసి పోయారని పేదలకు 10 ఏళ్ల నుండి గొప్పలు చెప్పుకొని కేవలం వారిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారే తప్ప వారికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ తదితర అధికారులతో మాట్లాడడం జరిగిందని ఈ పనుల కోసం ఏడుకొండల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని త్వరలోనే పనులు పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మున్సిపల్ పరిధిలో ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని అదేవిధంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు కూడా పూర్తిస్థాయిలో సహకరించమని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఆయా వార్డులలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఘనంగా స్వాగత సత్కారాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత , మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి,శ్రీనివాస్ నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, జ్యుమద్ ఖాన్, ఇబ్రహీం,మురళి మోహన్(అప్పి), కొప్పునూరి ప్రవీణ్,రమేష్,రవి కుమార్, యాదగిరి యాదవ్, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, మాధువలు, తుపాకుల శేఖర్,శ్రీహరి గౌడ్,కృష్ణ, రాయికల్ శ్రీనివాస్, సీతారాం, నవీన్, ఖదీర్, మంగ అశోక్, నీరటి వాసు, మన్నే రవి, రాజు, గడ్డమీద రమేష్, మనీష్, అన్వర్,శివ కుమార్, మున్సిపల్ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు..


# లక్నో పై సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం









%ఐపిఎల్‌లో భాగంగా సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ గెలుపుతో లక్నో ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి పాలు కావడంతో లక్నో నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 205 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (65), మార్‌క్రమ్ (61) శుభారంభం అందించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 18.2 ఓవర్లలోనే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. అభిషేక్ శర్మ 20 బంతుల్లోనే ఆరు ఫోర్లు, 4 సిక్సర్లతో 59 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఇషాన్ (35), క్లాసెన్ (47), కమిందు మెండిస్ (32) తమవంతు సహకారం అందించారు.సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ(35) చెలరేగి ఆడుతున్నాడు.

లియం ఓ రూర్కీ బౌలింగ్‌లో 4, 6 బాది జట్టు స్కోర్ 50 దాటించాడు. మరో ఎండ్‌లో ఇలరేగి ఆడుతున్నాడు. విలియం ఓ రూర్కీ బౌలింగ్‌లో 4, 6 బాది జట్టు స్కోర్ 50 దాటించాడు. అయితే.. ఆ తర్వాత దిగ్వేశ్ రథీ 6 పరుగులే ఇచ్చాడు. కానీ, అవేశ్ ఖాన్ బౌలింగ్‌లో అభి.. వరుసగా 2 ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్(16) సైతం దూకుడుగా ఆడుతున్నాడు. దాంతో, ఆరెంజ్ ఆర్మీ 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 72 పరుగులు చేసింది.భారీ ఛేదనను సన్‌రైజర్స్ ఓపెనర్లు ధాటిగా ఆరంభించారు. ట్రావిస్ హెడ్ స్థానంలో ఆడుతున్న అథర్వ తైడే(13) అలరించాడు. అయితే.. విలియం ఓరూర్కీ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన తైడే థర్డ్ మ్యాన్‌లో దిగ్వేశ్ రథీకి చిక్కాడు. 17 వద్ద ఆరెంజ్ ఆర్మీ తొలి వికెట్ పడింది. ఆ తర్వాత ఇషాన్ కిషన్(16) జతగా అభిషేక్(35) స్కోర్ బోర్డును ఉరికిస్తున్నాడు. ఆకాశ్ ఓవర్లో 4, 6తో దంచుడు మొదలెట్టిన అతడు విలియంకు చుక్కలు చూపించాడు.పిఎల్‌లో భాగంగా సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ గెలుపుతో లక్నో ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి పాలు కావడంతో లక్నో నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 205 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (65), మార్‌క్రమ్ (61) శుభారంభం అందించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 18.2 ఓవర్లలోనే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. అభిషేక్ శర్మ 20 బంతుల్లోనే ఆరు ఫోర్లు, 4 సిక్సర్లతో 59 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఇషాన్ (35), క్లాసెన్ (47), కమిందు మెండిస్ (32) తమవంతు సహకారం అందించారు.సొంతగడ్డపై లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్లు ఉతికేస్తున్నారు. బౌండరీలతో విరుచుకుపడుతూ స్కోర్‌బోర్డును పరుగులు పెట్టిస్తున్నారు. సన్‌రైజర్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తున్న మిచెల్ మార్ష్(41 నాటౌట్) అర్ధ శతకానికి చేరువయ్యాడు. మరో ఎండ్‌లో ఎడెన్ మర్క్‌రమ్(26 నాటౌట్) సైతం 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగాడు. ఈ ఇద్దరి విధ్వంసంతో లక్నో పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 69 పరుగులు చేసింది.ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవక తప్పని పోరులో టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. తొలి ఓవర్లోనే కమిన్స్‌కు ఫోర్‌తో స్వాగతం పలికిన మిచెల్ మార్ష్(41 నాటౌట్), నాలుగో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. 4వ ఓవర్లో మార్ష్ బౌండరీ కొట్టగా.. మర్క్‌రమ్(26 నాటౌట్) వరసగా 6, 4తో 17 పరుగులు పిండుకున్నాడు.

## ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలలో ఎంపికైన తెలంగాణ రాష్ట్ర నేతలు




హైదరాబాద్.ఈరోజు తెలంగాణ. మే 19 మే 15-18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలో తెలంగాణ రాష్ట్రం నుండి ఆరుగురు నేతలను జాతీయ కౌన్సిల్ లోకి ఎంపిక చేయడం జరిగింది. జాతీయ కార్యదర్శిగా వలి ఉల్లా ఖాద్రీ, జాతీయ వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యులుగా కల్లూరు ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్, జాతీయ సమితి సభ్యులుగా నానబాల రామకృష్ణ, లింగం రవి, వెంకటేశ్వర్లు లు ఎన్నికకావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన నేతలు మాట్లాడుతూ 17వ జాతీయ మహాసభలలో అనేక యువజన, విద్యార్థి, మహిళా,కార్మిక, కర్షక సమస్యలపై చర్చలు జరిగాయని, పాలకులు అవలంబిస్తున్న విధానాలపై నిర్దిష్టమైన చర్చలు జరిపి, తీర్మానాలు రూపంలో భవిష్యత్ పోరాటాలను ఈ మహాసభ కార్యాచరణ ద్వారా రూపొందించినదని వారు అన్నారు. అదే విధంగా నేడు దేశంలో కేంద్ర ప్రభుత్వం యువతను మతం పేరుతో విభజిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించింది, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను హరిస్తున్న పాలకులపై సంఘటిత ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ద్వారా మాత్రమే నిరుద్యోగం తగ్గుతుందన్నారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి 75మంది ప్రతినిధులుగా హాజరు కావడం జరిగిందన్నారు.

## కనీస మర్యాదలు చేయరా

## ఎక్స్ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



హైదరాబాద్. ఈరోజు తెలంగాణ. మే 19 ుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తన సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర కు వచ్చినప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వం కనీస మర్యాదలు చే యకపోవడం ప్రజాస్వామ్య విలువలను పాతరేయడమే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఈ విషయంలో మానసిక వేదకు గురయ్యారని వారు పేర్కొన్నారు. రాజ్యాంగంలో ప్రధానమైన న్యాయవ్యవస్థ పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని ఆయన అన్నారు. శాసన, కార్యనిర్వహణ, న్యాయ వ్యవస్థలు రాజ్యాంగంలో ప్రధాన అంగాలుగా పిలవబడుతాయని, పరస్పరం గౌరవించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలకు తగిన సూచనలు ఇవ్వాలని వారు తెలిపారు. గుల్జార్ హౌస్ లో జరిగిన ఘటన తీవ్రంగా కలసి వేసింది. హైదరాబాదులోని చార్మినార్ సమీపాన గల గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడడం తీవ్రంగా కలసి వేసిందని చాడా వెంకటరెడ్డి అన్నారు. ఈ సంఘటన బాధాకరమైందని వారు తెలిపారు. మృతి చెందిన కుటుంబాలకు 20 లక్షల ఎక్స్గ్రేషియో ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరారు. చనిపోయిన వారికి సంతాపాన్ని తెలియజేశారు

## ఎడిటోరియల్

# అంతటా దోపిడి

# వుతున్న ఆమె శ్రమ

తల్లులు రక్తలేమితో బాధపడుతున్నారు. నిజానికి కార్మిక రంగంలో వున్న మహిళల పట్ల చాలా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. రైతు కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకార, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్త్రీలపై జరిగిన పరిశోధనలో వారు రక్తలేమితో మధ్య వయస్సులోనే వంగిపోయి, కీళ్లు అరిగిపోయి, ప్రభుత్వాల నుండీ యాజమాన్యాల నుండి ఏటువంటి సహాయం లేక పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో జీవిస్తున్నారు. గర్భవతులుగా వున్నప్పుడు కూడా కూలికి వెళ్ళకపోతే జరగక మురికి వాడల్లో వుంటూ పౌష్టికాహారం లేక పచ్చళ్ళు తింటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనైతే నడి ఎండల్లో నాట్లు వేయడం, పగిలిన కాళ్ళతో కూడా బురదలో దిగి కలుపు తీయడం, మధ్యాహ్నానికి కళ్ళు తిరిగి పడిపోతున్నా అటు పాలకులు గాని ఇటు భూస్వాములు గాని మజ్జిగ కూడా ఇవ్వని దయలేని ప్రభుత్వంలో అభాగ్యంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో వున్న స్త్రీలు రక్తలేమితో బాధపడుతున్నట్లుగా సర్వేలు చెపుతున్నాయి. మహిళల శ్రమ దోపిడీ గురించి మహిళా మేధావులు వ్యధాపూరితమైన విషయాలను ప్రపంచం ముందుకు తెస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే గృహ, సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ లెక్కించినట్లైతే అది కొన్ని బిలియన్ డాలర్ల విలువైనదిగా ఉంటుంది. అయినప్పటికీ ఈ శ్రమ ఎప్పుడూ ఆర్థిక లెక్కల్లోకి రాదు. దానికి కారణం తరతరాలుగా మహిళల శ్రమను సహజమైన బాధ్యతగా చూడడం. అంటే మహిళలు పుడుతూనే చీపుళ్ళు, చాటలు, గరిటెలు పట్టుకుని పుట్టినట్టు. ఇంటి పని మహిళలకు చాలా సహజమైనదనే ప్రచారం పితృస్వామ్య సమాజం చేసింది. భారత రాజ్యాంగం స్త్రీల కోసం, మహిళల రక్షణ కోసం వారి ఆర్థిక వెసులుబాటు కోసం, వారి విద్యాభివృద్ధి కోసం ఎన్నో చట్టాలు చేసింది. కాని చాలామంది కొడుకుతో సమానంగా కూతురుకి సమాన ఆస్తి ఇవ్వడంలేదు. అందువల్ల వాళ్ళు నిర్భాగ్యులుగా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో కొడుకుతో సమానంగా కూతుర్ని చదివించటం లేదు. చివరకు కార్పొరేట్ స్కూళ్లలో కొడుకులను, గవర్నమెంటు స్కూల్‌లో కూతుళ్లను చదివిస్తుంటారు. ఇప్పుడు పదవ తరగతి పాసయిన ఆడపిల్లల్ని ఇంటర్మీడియట్‌లో చేర్చటం లేదు. వందల మంది ఆడపిల్లలకి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళు ఇంటర్‌కి వెళితే, ఊరు దాటి వెళితే ప్రేమలో పడతారనే అపోహతో తల్లిదండ్రులే వారిని నిరోధిస్తున్నారు. నిజానికి మనుస్మృతి చదవకపోయినా ఆ భావజాలం మాత్రం తండ్రుల మీద, భర్తల మీద బలంగా వుంది.దళిత వాడల్లో తాగుడు ఎక్కువై తల్లిని, భార్యను నిందిస్తున్నారు. తాగుడు కోసం భార్యను కొట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఇంట్లో పిల్లలు చదువుకొనే వాతావరణం లేకుండా చేస్తున్నారు. కొన్ని ఇళ్ళలో స్త్రీలు పొయ్యి మీద కుండ పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. మరొకవైపు వ్యవసాయంలో పని దినాలు బాగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కార్పొరేటు సంస్థలు రొయ్యలు బాగు చేయటం కోసం రాత్రి పూట 11 గంటల నుండి స్త్రీలను ఆటోల్లో పనులకు తీసుకొని వెళ్తున్నారు. అందుకు వాళ్ళకు అనేక జబ్బులు వస్తున్నాయి. పిల్లలకు ఆలన పాలన చూడలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయి.బడుగు వర్గాల్లోనే కాదు. అని వ్యవస్థల్లోను స్త్రీలు పురుష పెత్తనం కింద నలిగిపోతున్నారు. ఇదే అదనుగా మత వ్యవస్థలు, పాలకులు మత కులోన్మాదాలను ప్రోత్సహిస్తున్నారు. మత క్షేత్రాలను సందర్శించే యాత్రలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తి క్రమం నుండి ఆచార సాంప్రదాయాల్లోకే స్త్రీలను నెడుతున్నారు. నిజానికి ఇప్పుడు స్త్రీ మాతృత్వం మీద విపరీతమైన నిర్లక్ష్యం జరుగుతున్నది. ఎంతోమంది యువతులు ఉద్యోగాలు లేక, కట్న కానుకలు ఇవ్వలేక, పెళ్ళిళ్ళు గాక, ఒంటరి మహిళలుగా జీవిస్తున్నారు. ఇక భర్త చనిపోయిన, భర్తలు వలసలు పోయిన స్త్రీల మీద అరాచక శక్తులు దాడులు చేస్తున్నాయి. అసెంబ్లీలోనే వీటిపైన చర్చ జరుగుతుంది. ఒకపక్క గుట్కా, గంజాయి వంటి రకరకాల మత్తు పదార్థాలు, రకరకాల లిక్కర్లు ప్రతి వీధిలో దొరుకుతున్నాయి.

# పశ్చిమ ఆఫ్రికాలో సామ్రాజ్యవాదం



గతంలో ఫ్రాన్స్ దేశానికి వలసలుగా ఉండిన ఆఫ్రికా దేశాలు ఇప్పటికి కూడా పూర్తిగా వలస పెత్తనం నుండి బైట పడలేదు. తనకు వలసలుగా ఉండిన దేశాలకు స్వాతంత్ర్యం ప్రకటించినప్పటికీ, ఆ యా దేశాలలో ఉన్న తన ఆస్తుల రక్షణ నిమిత్తం అక్కడ ఫ్రెంచి సైన్యాలను మోహరించాలని ఫ్రాన్స్ పట్టుబట్టింది. అందుకు ఆ దేశాల ప్రభుత్వాలు అంగీకరించాయి కూడా. దాంతో ఆ దేశాలలోని అంతర్గత రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోడానికి ఫ్రాన్స్‌కు అమితమైన అవకాశం దొరికింది. దాంతోబాటు, ఈ దేశాలన్నీ సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ (సెంట్రల్ ఆఫ్రికన్ ఫ్రాంక్)ను ఉమ్మడి కరెన్సీగా అంగీకరించాయి. ఈ సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ ఫ్రెంచి కరెన్సీ అయిన ఫ్రాంక్ తో స్థిరమైన మారకపు రేటును కలిగివుంటుంది. ఈ స్థిరమైన మారకపు రేటును కొనసాగించాలంటే ఆ దేశాల ద్రవ్య విధానాన్ని ఫ్రెంచి సెంట్రల్ బ్యాంక్ కంట్రోల్‌లో ఉంచడానికి అంగీకరించాలి. ద్రవ్య విధానాన్ని ఆర్థిక విధానం నుండి వేరు చేయడం సాధ్యం కాదు. అంటే ఆచరణలో ఆ దేశాల ఆర్థిక విధానాలను చాలా మేరకు ఫ్రాన్స్ నిర్దేశిస్తూ వుంటుంది. ఫ్రాన్స్ యూరోపియన్ యూనియన్ ఆర్థిక వ్యవస్థతో కలిసిపోయినప్పుడు కూడా ఈ ఆఫ్రికన్ దేశాలపై ఫ్రాన్స్ నియంత్రణ కొనసాగుతూనే వుంది. అందుచేత ఈ పూర్వపు ఫ్రెంచి వలసలైన ఆఫ్రికన్ దేశాల స్వతంత్రం చాలా పరిమితులకు లోబడి నడుస్తోంది. ఒకవేళ ఏ దేశంలోనైనా విప్లవకారులు అధికారంలోకి వచ్చి ఈ ఫ్రెంచి చట్రాన్నుంచి విడగొట్టుకోడానికి ప్రయత్నిస్తే. ఆ దేశం మీద ఫ్రాన్స్ పలు రూపాలలో నయా ఉదారవాద ఆంక్షలను విధించి ముందడుగు పడకుండా నిరోధిస్తుంది. ఇందుకు అమెరికా మద్దతు ఎప్పుడూ ఉండనే వుంది.

బుర్కినా ఫాసో లో థామస్ సంకారా అనే విప్లవకారుడు అధికారంలోకి వచ్చినప్పుడు అతడు తన దేశం నుండి ఫ్రెంచి సైన్యాలు ఖాళీ చేయాలని ఆదేశించాడు. అప్పుడు అతడిని స్వంత పార్టీకి చెందిన వ్యక్తులే కుట్రపూరితంగా హత్య చేశారు. ఈ కుట్ర వెనుక ఫ్రెంచి సైనిక దళాల పాత్ర, ఫ్రెంచి ప్రభుత్వ మద్దతు ఉన్నాయని వేరే చెప్పనక్కరలేదు. అయితే నయా వలస ఆధిపత్యాన్ని ఎదిరిస్తూ ఈ దేశాలలో పోరాటాలు కొనసాగుతూనే వచ్చాయి. అటువంటి ప్రతిఘటన తరచూ సైనిక దళాలలోకి రిక్రూట్ చేయబడ్డ స్థానిక సాయుధ దళాల నుండి వచ్చింది. పి.ఎం.ఎస్.ఆర్ (పేట్రియాటిక్ మూవ్‌మెంట్ ఫర్ సేఫ్‌గార్డ్ అండ్ రెస్టొరేషన్) అనే సంస్థ 2022లో బుర్కినా ఫాసో లో ఏర్పడింది. దీనికి కెప్టెన్ ఇబ్రహిం ట్రావ్‌రె నాయకుడు. ఇతడు 2022 సెప్టెంబర్ 30న దేశంలో అధికారానికి వచ్చాడు. ఆ వెంటనే ఫ్రెంచి సైన్యాలను దేశం నుండి ఖాళీ చేయమని ఆదేశించాడు. ఖాళీ చేయించడంలో కృతకృత్యుడయాడు కూడా. తన దేశం చిక్కుకు పోయిన సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ ఏర్పాటు వల నుంచి బైటకు తెచ్చి ఆ ఏర్పాటుకు ముగింపు పలికాడు. తమ పొరుగు దేశాలైన మాలి, నైగర్ లలో ఉన్న ప్రభుత్వాలు కూడా వలసాధిపత్యం నుంచి పూర్తి స్థాయి విముక్తి కోరుకుంటున్నందున వాటితో కలిసి అసోసియేషన్ ఆఫ్ సాహెల్ స్టేట్స్ (ఎ.ఇ.ఎస్)ను ఏర్పాటు చేశాడు. ఆ ఉమ్మడి ఒత్తిడికి ఆ రెండు దేశాల నుండి కూడా ఫ్రెంచి, అమెరికన్ సైన్యాలు వైదొలగక తప్పలేదు. వాటితోబాటు నైగర్‌లో ఏర్పాటు చేసిన పెంటగాన్ డ్రోన్ కేంద్రాన్ని కూడా మూత వేయవలసి వచ్చింది. ఆ ప్రాంతం యావత్తూ ఖనిజ సంపదతో కూడి వుంది. అటువంటి చోట ఈ ఎ.ఇ.ఎస్ ఏర్పడి స్వతంత్రతను స్థిరపరచుకునేందుకు పూనుకోవడం సామ్రాజ్యవాదానికి కాల్లో ముల్లు మాదిరిగా ఉంది.

ఈ ఖనిజ సంపదలో బంగారం ఒక ముఖ్యమైన వనరు. ఆఫ్రికాలోకెల్లా అత్యధికంగా బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్న దేశం బుర్కినా ఫాసో. 2024లో ఆ దేశం 57 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసింది. కాని ఆ దేశ ప్రజలకు ఆ బంగారం వలన ఎటువంటి ప్రయోజనమూ దక్కలేదు. అక్కడి బంగారపు గనులు విదేశీ కంపెనీల పెత్తనంలో ఉండడమే దానికి కారణం. ఆ బంగారం ఉత్పత్తి నుంచి వచ్చే ఆదాయం దాదాపుగా ఆ విదేశీ కంపెనీలకే చెందుతుంది. అక్కడ ఉన్న పేట్రియాటిక్ ప్రభుత్వం 2024లో ఎస్.ఒ.పి.ఎ.ఎం.ఇ.బి అనే ఒక ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేసింది. బంగారపు ఖనిజాన్ని వెలికి తీసే ప్రైవేటు విదేశీ కంపెనీలను క్రమంగా స్వాధీనపరుచుకోడానికి దీనిని ఏర్పాటు చేశారు. తద్వారా వచ్చే ఆదాయంలో అధిక భాగాన్ని బుర్కినాబె ప్రజలకు విద్య, వైద్యం అందించడానికి ఖర్చు చేశారు. ఈ మధ్య డాలర్ భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడం, తమ సంపదను ఇన్నాళ్ళూ డాలర్ల రూపంలో దాచుకున్నవాళ్ళు ఇప్పుడు బంగారం రూపంలో దాచుకోడానికి సిద్ధమౌతూవుండడంతో బంగారం ధర పెరుగుతోంది. ఈ పరిస్థితిని బుర్కినా ఫాసో ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తోంది. అక్కడి నుంచి ఫ్రెంచి సైన్యాలను వెళ్ళగొట్టిన అనంతరం ఆ దేశం మీద సామ్రాజ్యవాదులు విధించిన ఆంక్షల ప్రభావాన్ని తగ్గించడానికి కూడా ఉపయోగపడుతోంది.

ఇక్కడితో అయిపోలేదు. ట్రావ్‌రె ప్రభుత్వం తన దేశంలో ఒక బంగారం శుద్ధి చేసే కర్మాగారాన్ని కూడా స్థాపించింది. తద్వారా బంగారు ఆభరణాల, వస్తువుల తయారీని కూడా నియంత్రించగలుగుతోంది. అంతేగాక వ్యవసాయోత్పత్తులను కూడా ప్రాసెస్ చేసే పరిశ్రమలను స్థాపించింది. మరోవైపు దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతోంది.ఈ చర్యలన్నీ అమెరికా ఆగ్రహానికి కారణం కావడం ఊహించలేనిదేమీ కాదు. అమెరికా కు చెందిన ఆఫ్రికా కమాండ్ (ఆఫ్రికామ్) చీఫ్ అయిన జనరల్ మైకెల్ లాంగ్‌లే అమెరికన్ సెనేట్ కమిటీ ముందు వాంగ్మూలమిస్తూ ఇబ్రహీం ట్రావ్‌రె బంగారం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని తమ స్వంతానికి, స్వంత భద్రతను మరింత పటిష్టం చేసుకోడానికి దారి మళ్ళిస్తున్నాడని విషపూరితంగా ఆరోపించాడు. ఈ వ్యాఖ్యానాలను మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. అయితే యావత్తు ఆఫ్రికాలోని ప్రజానీకం లాంగ్‌లే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బహుశా లాంగ్‌లే ఈ విధంగా వ్యాఖ్యానం చేయడం వెనుక అసలు లక్ష్యం ట్రావ్‌ర్రేను పదవీచ్యుతుడిని చేయడానికి పన్నిన కుట్రను సమర్ధించుకోవడమే అయివుండొచ్చు. లాంగ్‌లే ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే ఏప్రిల్ 16న ఒక కుట్ర ప్రయత్నం జరిగింది. పశ్చిమ దేశాల మీడియాలో ఊరూ పేరూ లేకుండా పలు రాతలు వెలువడ్డాయి. అవన్నీ ట్రావ్‌రె ప్రభుత్వం నియంతృత్వ ప్రభుత్వం అని, బుర్కినా ఫాసోలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని అవాస్తవాలతో నిండివున్నాయి. అయితే, ఆ కుట్ర భగం అయింది. కుట్రదారులు అరెస్టయ్యారు. అందుచేత సంకారా కు పట్టిన గతి ట్రావ్‌రేకు పట్టలేదు.ఒక ఆఫ్రికన్ ప్రభుత్వం వలసవాదుల ఉచ్చు నుండి బైట పడడానికి ప్రయత్నించినప్పుడు అందుకు పూనుకున్న ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూలగొట్టడానికి సామ్రాజ్యవాదం ప్రయత్నించడం అన్నది ఊహించలేని విషయం ఏమీ కాదు. అందరికీ తెలిసిన పాత చింతకాయ పచ్చడి లాంటిదే ఈ ప్రయత్నం. అయితే ఆఫ్రికన్ దేశాలు వలసవాద ఉచ్చు నుండి బైట పడడం అనేది ఎన్ని కష్టాలతో కూడుకుందో ఇది తెలియజేస్తోంది. బుర్కినా ఫాసో ప్రభుత్వం ఒక వైపు సామ్రాజ్యవాద కుట్రలను ఎదుర్కొంటూనే మరోవైపు ఇస్లామిక్ ఉగ్రవాదుల తిరుగుబాటును కూడా ఎదుర్కోవలసి వస్తోంది. వాళ్ళ చేతుల్లో దాదాపు 40 శాతం భూభాగం ఉంది. చుట్టుపక్కల పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాలు ఉన్నాయి. ఆ దేశాల్లో ఒక మొక్కుబడిగా ఎన్నికలు జరుగుతూ వుంటాయి. అందులో ప్రజలకు నిజంగా ప్రాతినిధ్యం వహించే సంస్థలేవీ పాల్గొనవు. కాని ఆ ప్రజలు మాత్రం ఓట్లు వేస్తారు. ఎవరు ఎన్నికైనా వాళ్ళు సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరిస్తారు. అటువంటి తొత్తు ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని తమ అధికారాన్ని ప్రశ్నించే దేశాలమీద ఆంక్షలను ప్రయోగించడం సామ్రాజ్యవాదుల ఎత్తుగడల్లో ఒక భాగం.

అందులో భాగంగానే బుర్కినా ఫాసో కు వ్యతిరేకంగా ఎకనామిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్ (ఇ.సి.ఒ.డబ్ల్యు.ఎ.ఎస్) ను దింపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి ఆ కూటమి బుర్కినా ఫాసో మీద ఆర్థిక ఆంక్షలను ప్రయోగిస్తానని బెదిరించింది (సామ్రాజ్యవాదుల తొత్తుగా ఉండే 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాన్ని కూలదోసి ప్రస్తుత బుర్కినా ఫాసో ప్రభుత్వం ఏర్పడింది). కాని ఇబ్రహీం ట్రావ్‌రె ప్రభుత్వానికి గట్టి ప్రజా మద్దతు ఉంది. ప్రభుత్వానికి మద్దతుగా భారీ సంఖ్యలో ప్రజలు వీధుల్లో ప్రదర్శనలు చేశారు. ఇకోవాస్ నుండి విడగొట్టుకుని ఎ.ఇ.ఎస్ ఏర్పడింది. గతంలో సంకారా మీద కుట్రకు పాల్పడిన మూకలు పొరుగునే ఉన్న ఐవరీ కోస్ట్ అనే దేశానికి పోయి అక్కడ తల దాచుకుంటున్నాయి. ఫ్రాన్స్ పనుపున బుర్కినా ఫాసోలో కుట్రలు చేయడానికి స్థావరంగా ఐవరీ కోస్ట్ ఉపయోగపడుతోంది. ఇప్పుడు విఫలమైన ఏప్రిల్ కుట్రలో పాల్గొన్న మూకలు కూడా ఐవరీ కోస్ట్ లోనే తల దాచుకున్నాయి.

ఇన్ని కష్టాల నడుమ వలసవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి యావత్తు పశ్చిమ ఆఫ్రికా లోని ప్రజానీకమూ పూర్తి మద్దతును అత్యుత్సాహంగా అందిస్తున్నారు. బుర్కినా ఫాసో కు దూరంగా ఉండమని సామ్రాజ్యవాదుల్ని డిమాండ్ చేస్తూ మొత్తం పశ్చిమ ఆఫ్రికా అంతటా ప్రజానీకం రోడ్లపైకి వచ్చి భారీ ర్యాలీలు చేశారు. వారు బ్రహీం ట్రావ్‌రె ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. గతంలో పాట్రిస్ లుముంబా, ఎమిల్కర్ చాబ్రాల్, ఎడ్వర్డో మాండేన్, థామస్ సంకారా వంటి నేతలు ఏ లక్ష్యం కోసమైతే తమ ప్రాణాలర్పించారో, క్వామే ఎన్‌కుమా, జూలియస్ నైరెరి వంటి నేతలు జీవితాంతమూ ఏ లక్ష్యం కోసం పోరాడారో, ఆ లక్ష్యం నేడు ఆఫ్రికన్ ప్రజల నడుమ మార్మోగుతోంది. ప్రస్తుతం మనం ఆఫ్రికా విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ఒక నూతన అధ్యాయాన్ని చూస్తున్నాం.రాబోయే రోజుల్లో సామ్రాజ్యవాదం మరింత క్రూరంగా ఈ పోరాటాన్ని అణచివేయడానికి ప్రయత్నం చేయడం తథ్యం. పాత ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు తోడు, తాజాగా డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడెక్కడున్న ముడి ఖనిజ సంపదనూ కొల్లగొట్టడానికి తహతహలాడడం ఆఫ్రికాలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే కాంగోలోని ప్రభుత్వం చేతులు కలపడంతో ట్రంప్ ప్రభుత్వం ఆ దేశంలోని ఖనిజ సంపదను తన పెత్తనంలోకి తెచ్చుకునేందుకు పథకాన్ని సిద్ధం చేసింది. ప్రపంచం లోని ఖనిజ సంపదను, ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీలో, కొత్తగా తలెత్తుతున్న టెక్నాలజీలలో వినియోగించే ఖనిజ సంపదను తన అధీనంలోకి తెచ్చుకోవాలని ట్రంప్ చాలా తొందరపడుతున్నాడు. అందుకే ఉక్రెయిన్ విషయంలో తొందరగా ఒప్పందం కుదుర్చుకోవాలని, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని, కెనడాను అమెరికా యొక్క 51వ రాష్ట్రంగా చేసుకోవాలని తాపత్రయపడుతున్నాడు. చివరికి సముద్రం అడుగున ఉన్న భూభాగాన్ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని అనుకుంటున్నాడు. రష్యా, ఉక్రెయిన్ ల నడుమ శాంతి ఒప్పందం కుదర్చడానికి ఒక నిజాయితీ కలిగిన మధ్యవర్తి పాత్ర పోషిస్తానంటూ ప్రకటించడం వెనుక ఆ రెండు దేశాలలోనూ ఉన్న అపార ఖనిజ నిక్షేపాలను చేజిక్కించుకోవాలనే కాంక్ష ఉంది.

ఏదేమైనా రానున్న రోజుల్లో ఒకవైపు సామ్రాజ్యవాదం, మరోవైపు ఆఫ్రికాలో వలస పీడన నుండి విముక్తి కోసం పోరాడుతున్న శక్తులు తీవ్రంగా ఘర్షించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆ ఘర్షణలకు ఆఫ్రికా ఖండం వేదిక కానున్నది. ఒకవైపు ఆ ఖండపు అపార ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టాలనే సామ్రాజ్యవాదులు, రెండోవైపు తమ ఖండంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోడానికి ఆ వనరులను ఉపయోగించాలనుకునే స్థానిక శక్తులు మోహరించి వున్నాయి.

# జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం



ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షి జాతులు నశిస్తున్నాయి. అందులో పిచ్చుకలు అంతరించిపోయే పక్షి జాతుల్లో మొదటి వరుసలో ఉన్నాయి. నగరీకరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోంది. దానికి తోడు వాతావరణంలో మార్పులు, విపరీతమైన ఎండలు, తగ్గుతున్న హరితం వల్ల కూడా అవి అంతరించిపోయే దశ వేగవంతంగా తయారైంది. జీవవైవిధ్యం కోల్పోవడం మరిన్ని కొత్త ప్రకృతిపరమైన ఉపద్రవాలకు కారణభూతమౌతుంది. ఉదాహరణకు కొన్ని పక్షులు కీటకాల సంతతిని అదుపులో ఉంచుతాయి. తద్వారా పంటల పెరుగుదలకు ఊతమిస్తాయి. ఒక పక్షి జాతి లేదా జంతు జాతి నశిస్తే, దానితో పాటు పర్యావరణ సమతుల్యత అదుపు తప్పుతుంది. మరిన్ని విపరిణామాల్ని మానవాళి నెత్తిపై రుద్దుతుంది. కాబట్టి సమాజం అలాంటి విపత్తు రాకుండా జాగ్రత్త వహించాలి. జీవరాశుల ఉనికికి భంగం రానీయకుండా, వాటి మనుగడకు సహకరించాలి. ఉదాహరణకు మండుటెండల్లో ఇంటి ఆవరణలో ఒక మట్టి పాత్రను నీటితో నింపి ఉంచొచ్చు. అది చిన్న పనిలా మనకు అనిపించినా, దాహంతో ఉన్న పక్షికి అదే పెద్ద సాయం. ఒక్కోసారి వాటి ప్రాణం నిలుస్తుంది. అలాగే పూర్వం మన ఇళ్లల్లో, పశువుల శాలల్లో చూరుకి వరి కంకులు వేలాడదీసే వారు. పిచ్చుకలు, ఇతర చిన్న పక్షులు హాయిగా వచ్చి చేరేవి. ఆ అలవాటుని మళ్లీ మనం వాడుకలోకి తీసుకురావాలి. జీవవైవిధ్యం, జీవ సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగించాలి. వారితో తదనుగుణమైన చర్యలు చేయించాలి. పెద్ద సభల్లో పెద్ద ఉపన్యాసాల కన్నా క్షేత్ర పరిధిలో చిన్న చిన్న సమూహాలకు నేర్పే అలవాట్లు పెద్ద మార్పుని తీసురాగలవు. ఈ బాధ్యత అందరూ తీసుకోవాలి.

# ఉదయాన్నే అసలేం జరిగింది..? గుల్జార్ హౌస్ ప్రమాదానికి అనేక కారణాలు..

ఓల్డ్ సిటీ అగ్నిప్రమాదంతో తెలంగాణ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంటల్లో 17 మంది మృతిచెందడం యావత్ రాష్ట్రాన్ని విషాదంలోకి నెట్టింది. చిన్నారులు సైతం ప్రమాదంలో చనిపోవడం కలిచివేస్తోంది. కాగా.. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు అయింది. చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఉత్కృష్ మోడీ బంధువు ఫిర్యాదు చేశారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో కోరారు.
%ఓల్డ్ సిటీ అగ్నిప్రమాదంతో తెలంగాణ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంటల్లో 17 మంది మృతిచెందడం యావత్ రాష్ట్రాన్ని విషాదంలోకి నెట్టింది. చిన్నారులు సైతం ప్రమాదంలో చనిపోవడం కలిచివేస్తోంది. కాగా.. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు అయింది. చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఉత్కృష్ మోడీ బంధువు ఫిర్యాదు చేశారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో కోరారు. 6:45 కు సమీప బంధువు ఫోన్ చేసి ఫైర్ యాక్సిడెంట్ జరిగిందని చెప్పారు.. తాము ము హుటాహుటిన వెళ్ళి చూసేసరికి ఫైర్ సిబ్బంది సహాయకచర్యలో ఉన్నారన్నారు. 17 మంది అపస్మారక స్థితిలో ఉన్నవారిని బయటికి తీసి హాస్పిటల్‌కు తరలించారని తెలిపారు. వీరితో పాటు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న కృష్ణ పెరల్స్, మోడి పెరల్స్ షాప్‌లు పూర్తిగా దగ్ధం అయ్యాయన్నారు. అగ్ని ప్రమాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని మృత్యుల బంధువు కోరారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి కూడా విచారణకు ఆదేశించారు. అయితే.. అసలీ మంటల వెనుక మర్మమేంటి..? షార్ట్ సర్క్యూటేనా..? మరేమైనా కారణాలున్నాయా..? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి..17 నిండు ప్రాణాలను బలితీసుకున్న చార్మినార్ గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదానికి కారణం ఏంటి ? అధికారులు ఎంతగానో శ్రమించినా.. అంతమంది ఎందుకు చనిపోయారు ? ఇంట్లో మంటలు అంతలా ఎలా వ్యాపించాయి ? అనే విషయాలపై అధికారులు క్లారిటీ ఇచ్చారు.

అగ్ని ప్రమాదంతో పెను విషాదాన్ని మిగిల్చిన గుల్జార్ హౌస్ ఇంట్లో తరచూ విద్యుత్ సమస్యలు వచ్చిన విషయాన్ని అధికారులు గుర్తించారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

ప్రమాదంలో అంతగా మంటలు వ్యాపించడానికి అసలు కారణం.. ఇంట్లో చెక్కతో చేసిన ప్యానెళ్లు ఎక్కువగా ఉండటమే. షార్ట్ సర్క్యూట్‌తో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని అధికారులు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడమే ప్రమాదానికి కారణం. ఏసీ కంప్రెసర్ పేలిపోవడంతోపాటు, ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని నిర్ధారణకు వచ్చారు.

ప్రమాద తీవ్రత ఈ స్థాయిలో ఉండటానికి మరో ప్రధాన కారణం ఈ బిల్డింగ్‌కు ఎలాంటి ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ లేకపోవడమే అని తెలుస్తోంది. ఇది పాత భవనం కావడంతో ఇందుకు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని సమాచారం.

ప్రమాదం జరిగిన తరువాత బాధితులు బయటకు వచ్చేందుకు తగిన మార్గాలు లేకపోవడం కూడా ప్రమాద తీవ్రత పెరగడానికి కారణంగా తెలుస్తోంది. భవనం పైనుంచి కిందికి రావాలంటే ఒకటే దారి ఉండటంతో బాధితుల్లో ఎక్కువమంది బయటకు రాలేకపోయారు.




అగ్నిప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ టీమ్ వేగంగా స్పందించింది. అయితే మంటల వ్యాపించిన ఇంట్లోకి వెళ్లడానికి వారికి కూడా సరైన మార్గం లేకుండా పోయింది. ఇంట్లోకి వెళ్లడానికి ఇరుకైన మెట్లు ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగేలా చేసింది.

ప్రమాదం కారణంగా లోపల ఇరుక్కుపోయిన బాధితులను రక్షించేందుకు షట్టర్‌తో పాటు గోడ బద్దలుగొట్టాకే లోపలికి వెళ్లాల్సి వచ్చింది. దీన్ని బట్టి భవనంలోకి వెళ్లడం ఎంత కష్టంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.ఇక భవనం బయటకు జీ-ప్లస్-వన్ ఉన్నట్టుగా కనిపించినా.. లోపల జీ ప్లస్ 2 ఉంది. దీంతో అందులో ఎక్కువమంది ఉన్నారని ఎవరూ ఊహించలేకపోయారు. ఈ సహాయక చర్యలలో ఆధునిక సాంకేతిక పరికరాలు అడ్వాన్స్‌డ్ ఫైర్ రోబో .. బ్రోటో స్కైలిఫ్ట్ హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించారు.

ప్రమాదం జరిగిన తరువాత అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించారు. అయితే మెట్లపై నుంచి కూడా మంటలు వ్యాపించడంతో సహాయక చర్యల్లో కొంత జాప్యం జరిగినట్టు తెలుస్తోంది.అగ్నిప్రమాదం నుంచి బాధితులు తప్పించుకోవడానికి మరో మార్గం ఉన్నప్పటికీ అది సాధ్యపడలేదు. టెర్రస్ దగ్గర మెట్లకు తాళం వేసి ఉండటంతో.. బాధితులు బయటకు వెళ్లలేకపోయారు. ప్రమాదంలో మృతుల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

# హైదరాబాద్‌లో ఉగ్రకుట్ర భగ్నం.. వెలుగులోకి సంచలన విషయాలు..



హైదరాబాద్‌లో భారీ పేలుళ్ల కుట్రను ఏపీ, తెలంగాణ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్ల కోసం ఐసిస్ వేసిన స్కెచ్‌ను చాకచక్యంగా చేధించారు. విజయనగరం టూ హైదరాబాద్‌కు చేపట్టిన ఆపరేషన్ బ్లాస్ట్‌ను పోలీసులు భగ్నం చేయడం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. అటు.. హైదరాబాద్ పేలుళ్ల కుట్ర బట్టబయలు కావడంతో..%హైదరాబాద్‌లో భారీ పేలుళ్ల కుట్రను ఏపీ, తెలంగాణ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్ల కోసం ఐసిస్ వేసిన స్కెచ్‌ను చాకచక్యంగా చేధించారు. విజయనగరం టూ హైదరాబాద్‌కు చేపట్టిన ఆపరేషన్ బ్లాస్ట్‌ను పోలీసులు భగ్నం చేయడం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. అటు.. హైదరాబాద్ పేలుళ్ల కుట్ర బట్టబయలు కావడంతో విజయనగరం ఉలిక్కిపడింది. కుట్రకు ప్లాన్ చేసిన సిరాజ్.. విజయనగరంలో అరెస్ట్ అవడంతో షేక్ అయింది. విజయనగరానికి చెందిన సిరాజ్ ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన సమీర్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనం సృష్టించింది. సమీర్‌ను హైదరాబాద్ నుంచి విజయనగరం తరలించారు. కోర్టు అనుమతితో ఇద్దర్నీ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు పోలీసులు.దేశంలో ఎక్కడ ఉగ్రనీడలు బయటపడినా.. దాని లింకులు హైదరాబాద్‌లో కనెక్ట్ అవుతుండడంతో టెర్రర్ ఇండికేషన్స్‌పై కొన్నాళ్లుగా ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే.. నిందితుడు సిరాజ్‌పై ఆర్నెల్లుగా డేగ కన్నేసింది. సిరాజ్‌కు.. సమీర్‌కు పేలుళ్లపై ఐసిస్ ఆదేశాలు ఇచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఇద్దరు కలిసి హైదరాబాద్‌లో ముందుగా డమ్మీ బ్లాస్ట్‌కు ప్లాన్ చేశారు. దానిలో భాగంగానే.. విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసిన సిరాజ్.. సోషల్ మీడియా ద్వారా బాంబుల తయారీకి పూనుకున్నాడు. దీనిపై.. పక్కా సమాచారం అందుకున్న ఏపీ, తెలంగాణ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌తో పేలుళ్ల కుట్రకు చెక్ పెట్టారు. సిరాజ్ నుంచి అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం లాంటి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.తెలంగాణ పోలీస్ అప్రమత్తతతో ఉగ్రవాదుల పెద్ద కుట్రను భగ్నం చేసింది. హైదరాబాద్ మహానగరంలో పేలుళ్ల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. హైదరాబాద్ వ్యాప్తంగా దాడులతో పాటు పేలుళ్లకు ఐసిస్ కుట్ర చేసినట్లు పోలీసులు గుర్తించారు. తెలంగాణ కౌంటర్ ఇంటలిజెన్స్ సంచలన ఆపరేషన్‌లో పేలుళ్లకు ప్లాన్ చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.తెలంగాణ పోలీస్ అప్రమత్తతతో ఉగ్రవాదుల పెద్ద కుట్రను భగ్నం చేసింది. హైదరాబాద్ మహానగరంలో పేలుళ్ల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. హైదరాబాద్ వ్యాప్తంగా దాడులతో పాటు పేలుళ్లకు ఐసిస్ కుట్ర చేసినట్లు పోలీసులు గుర్తించారు. తెలంగాణ కౌంటర్ ఇంటలిజెన్స్ సంచలన ఆపరేషన్‌లో పేలుళ్లకు ప్లాన్ చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో భారీ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్ కలిసి హైదరాబాద్ నగరంలో భారీ పేలుళ్లకు ప్లాన్ చేశారు. ఇందు కోసం విజయనగరంలో సిరాజ్ పేలుడు పదార్థాలు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. సౌదీ అరేబియా నుంచి సిరాజ్, సమీర్‌లకు ఐసిస్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలంగాణ కౌంటర్ ఇంటలిజెన్స్ అధికారులు గుర్తించారు. వీరి నుంచి భారీగా ఆయుధాలతోపాటు కీలక సమాచారాన్ని రాబట్టు తెలుస్తోంది. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు.ఇక.. హైదరాబాద్‌లోని పలు చోట్ల బ్లాస్టింగ్‌కు సౌదీ అరేబియా నుంచి ఐసిస్ ఈ కుట్రకు ప్లాన్ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. లోతైన దర్యాప్తుతో ఇద్దరు నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని రాబట్టనున్నారు.